# సార్వత్రిక ఎన్నికలు.. సామాజిక తనిఖీ

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల పాత్ర విడదీయలేనిది. ఈ వ్యవస్థలో ప్రతి వ్యవహారంలో వారు నిరంతరం పాలుపంచుకుంటారు. గ్రామీణ, పట్టణ స్థాయి నుంచి కేంద్ర స్థాయి వరకు జరిగే ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకుంటూ.. సగటు పౌరుడు ప్రభుత్వాన్ని తనిఖీ చేస్తున్నాడు. ప్రజల భాగస్వామ్యం ద్వారానే వివిధ స్థాయిల్లో ప్రభుత్వానికి చట్టబద్ధత లభిస్తుంది. వాస్తవానికి పాలనా ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం ఈనాటిది కాదు. ప్రాచీన కాలంలోనే బీహార్‌లోని మల్ల, లిచ్ఛవిస్ రిపబ్లిక్‌లలో ప్రజాప్రాతినిథ్య సభలుండేవి. వాటిలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులుండేవి. వేదాల్లో పేర్కొన్నట్లు.. ''ఎన్నికకాని పాలకుడు బలపదాక్రమణదారుడు''. సాధారణంగా ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య వ్యవస్థ పుట్టుపూర్వోత్తరాలు చర్చించేటప్పుడు ముందుగా గ్రీకు దేశాన్ని ప్రస్తావిస్తారు. ప్రాచీన గ్రీకు దేశంలో సంఘ విద్రోహశక్తులను పట్టణం నుంచి వెలేయడానికి పౌరులు పగిలిన మట్టి పెంకులపై ఆ విద్రోహి పేరు రాసేవారు. ఇక.. మొదటి బ్యాలట్ పత్రాన్ని క్రీ.పూ. 139లో రోమ్ పట్టణం లో వినియోగించారు. ఆధునికయుగంలో ఉత్తర అమెరికాలోని మెసాచ్యుసెట్స్ వలస ప్రాంతంలో 1629లో సేలం చర్చి మత గురువును ఎన్నుకోవడానికి కాగిత బ్యాలెట్‌లు వాడారని తెలుస్తోంది. రహస్య ఓటింగ్ విధానాన్ని మొట్టమొదట 1950లో ఆస్ట్రేలియాలో ప్రవేశపెట్టారు.

### స్వతంత్ర భారతంలో సార్వత్రిక ఎన్నికలు:

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఇప్పటి వరకు మన దేశంలో 15 సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 543 లోక్‌సభ నియోజకవర్గాలకు 4061 రాష్ట్ర విధానసభ నియోజక వర్గాలకు ప్రతినిధులను ఓటర్లు ఎన్నుకుంటారు. మనదేశంలో ఓటు వేయడం నిర్బంధం కాకపోయినా.. ప్రతి ఓటరు పాటించాల్సిన విధి. 15వ సార్వత్రిక ఎన్నికల్లో 543 లోక్‌సభ నియోజక వర్గాలకు, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, సిక్కిం రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాలకు ఓటింగ్ జరిగింది. దీంతోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు ఓటింగ్ ప్రక్రియ ముగిసింది. ఈ ఎన్నికల కోసం దేశవ్యాప్తంగా 8, 28, 804 పోలింగ్ కేంద్రాలు, 13, 68, 430 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచారు. తాజా ఎన్నికల యజ్ఞంలో జమ్ము కాశ్మీర్, ఉత్తర ప్రదేశ్‌లలో అయిదు దశలు.. బీహార్‌లో నాలుగు దశలు.. పశ్చిమబెంగాల్‌లో మూడు దశలు.. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, అసోం, మణిపూర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. మిగతా 15 రాష్ట్రాలు, ఏడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఒకే దశలో ముగిశాయి. ఈ ఎన్నికల్లో ఏడు జాతీయ పార్టీలు, 39 ప్రాంతీయ పార్టీలు, వందలకొద్దీ స్వతంత్ర అభ్యర్థులు పోరాడారు. అసోం, నాగాలాండ్, జమ్ము కాశ్మీర్ మినహా దేశవ్యాప్తంగా ఫొటో ఓటర్ లిస్టులను ఉపయోగించారు. భారతదేశ ఓటర్ల సంఖ్య.. ప్రపంచంలోని అనేక దేశాల మొత్తం జనాభా కంటే ఎక్కువ! ఇంతటి క్లిష్ట

ప్రక్రియ నిష్పాక్షికంగా, సాఫీగా, స్వేచ్ఛగా జరగడానికి కారణం ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి. కొండలు, లోయలు, సముద్రతీర ప్రాంతాలు, దట్టమైన అడవులు, ఎడారులతో కూడిన భూభాగం లో ప్రణాళికాబద్ధంగా నిర్దేశించిన సమయంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించడం అంత సులువు కాదు. సగటున ప్రతి పోలింగ్ కేంద్రంలో వెయ్యి నుంచి రెండు వేల మంది తమ ఓటు హక్కు ను వినియోగించు కుంటారు. కానీ... 2004 ఎన్నికల్లో ఓ చోట కేవలం ముగ్గురి కోసం కూడా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 5000 మీటర్ల ఎత్తులో ఉన్న లఢక్ ప్రాంతంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొన్ని సందర్భాల్లో చిన్న ద్వీపాల్లో నివసించే వారికోసం సంచార పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సామగ్రిని మోయడం ద్వారా రాజస్థాన్‌లో ఒంటెలు, అసోంలో ఏనుగులు ఎన్నికల ప్రక్రియకు తోడ్పడతాయి. ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతాలకు ఎన్నికల సిబ్బందిని హెలికాప్టర్ ద్వారా తరలిస్తారు. ఎన్నికల నిర్వహణలో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లను ఉపయోగించుకుంటారు. సైన్యంలో పనిచేసే వారు తమ బంధువుల (proxy) ద్వారా ఓటు వేయవచ్చు. మిగిలిన వారంతా తప్పనిసరిగా పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేయాలి.

## 1982-83లో తొలిసారి ఈవీఎం :

దేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను 1982-83లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. మొదటిసారిగా పరూర్ (కేరళ)లో ప్రవేశపెట్టినప్పుడు ఆ ఎన్నికల్లో ఓడిన అభ్యర్థి ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానాన్ని సుప్రీం కోర్టులో సవాలు చేశారు. 1989 ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణ చేసి ఈవీఎంల వినియోగాన్ని చట్టబద్ధం చేశారు. వి.పి.సింగ్, జార్జి ఫెర్నాండెజ్ వంటి రాజకీయ ప్రముఖులు ఈ విధానం లోపభూయిష్టమని విమర్శించారు. 1990లో వి.పి.సింగ్ నియమించిన ఎన్నికల సంస్కరణల కమిటీ(దినేష్ గోస్వామి కమిటీ) ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగాన్ని సిఫార్సు చేసింది. ఈ యంత్రాల వల్ల అనేక ప్రయోజనాలు... అవి...

- ఓట్ల లెక్కింపు వేగంగా జరుగుతుంది.
- బ్యాలెట్ పేపర్ల ముద్రణాఖర్చు ఉండదు.
- చెల్లని ఓట్ల ప్రసకితలెత్తదు.
- రిగ్గింగ్‌కు అవకాశం లేదు.

## ఎన్నికల తనిఖీ :

ఎన్నికల ప్రవృత్తి సజావుగా జరుగుతుందో లేదో పరీక్షించడాన్ని తనిఖీగా నిర్వచించవచ్చు. అర్హులైన ఓటర్లందరూ నిర్భయంగా ఓటు వేయగలుగుతున్నారా? దీనికి జవాబివ్వడం అంత తేలిక కాదు. మొదటిగా ఓటర్ల లిస్టులు తప్పులు తడకగా మారాయి. ఎన్నికల సంఘం ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తున్నా, ఓటర్లలిస్టులో పేర్లు మాయమవడం, కొందరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదవడం వంటి

ఉదంతాలున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు జీవనోపాధి కోసం తరచుగా వేరే ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. కొత్త ప్రదేశంలో ఓటరుగా నమోదు చేసు కోవడం వారికంత సులభం కాదు. ప్రస్తుతం అవలంభిస్తున్న విధానం అంత సరళం కాదు. రెండోది.. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎంతవరకు అర్హులన్నది ప్రధాన సమస్య. అన్ని రాజకీయ పక్షాలు అభ్యర్థి గుణగణాలతో సంబంధం లేకుండా కులం, బలం, ధనం ప్రాతిపదికగా ఎంపిక చేస్తున్నారు. ఇటీవల రద్దయిన లోక్‌సభలో 122 మంది సభ్యులు నేరచరితులు. వీరిపై దోపిడీ, హత్యలు, మాన భంగాలు తదితర అభియోగాలున్నాయి. ఇక.. రాష్ట్రాల శాసన సభల్లో 20 –25 శాతం సభ్యులు నేరచరితులే.

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విధిగా తమపైనున్న క్రిమినల్ కేసుల సమాచారాన్ని నామినేషన్ దాఖలు చేసేప్పుడు అఫిడవిట్‌లో ప్రకటించాలని సుప్రీంకోర్టు 2003లో తీర్పునిచ్చింది. ఈ తీర్పుని అన్ని రాజకీయ పక్షాలు నిరసించాయి. వాస్తవానికి ఈ సంచలనాత్మక తీర్పు ఎన్నికల ప్రక్రియను తనిఖీ చేయడానికి ప్రధాన సాధనంగా నిలుస్తుంది. ఇటీవల పదవీ విరమణ చేసిన ఎన్నికల ప్రధానాధికారి ఎన్.గోపాలస్వామి పేర్కొన్నట్లు.. మన ఎన్నికల ప్రక్రియలో చోటు చేసుకున్న అనేక అపశ్రుతులు మనం సిగ్గుపడేలా చేస్తున్నాయి. ధన, కుల, బల ప్రయోగం.. పోలింగ్ కేంద్రాలను ఆక్రమించుకోవడం, హింసాయుత సంఘటనలు చోటు చేసుకోవడం.. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు యంత్రాంగం పక్షపాత వైఖరితో వ్యవహరించడం.. నిర్దేశించిన మొత్తం కంటే ఎక్కువ ఖర్చుపెట్టడం.. ఓటర్లను ప్రలోభ పెడుతూ డబ్బు, మద్యపానం సరఫరా చేయడం.. వంటివి మన ఎన్నికల ప్రక్రియను హేళన చేస్తున్నాయి.

మూడోది.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రస్తుతం మన రాజకీయ పక్షాల వైఖరి శోచనీయంగా ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయాల్సిన రాజకీయ పక్షాల్లోనే ప్రజాస్వామ్య లక్షణాలు లేవు. అంతర్గత ప్రజాస్వామ్యానికి నోచుకోని ఈ పార్టీలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. పార్టీ నాయకుల ఎంపిక ప్రజాస్వామ్యబద్ధం కాదు. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శాసనసభలలో స్వేచ్ఛగా వ్యవహరించే అవకాశం లేదు. ఎన్నికల నెపంతో సేకరించే విరాళాలకు తగిన లెక్కలు చూపించరు. ఇన్ని అవకతవకలతో కూడిన ఈ పార్టీలు ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎలా కృషి చేస్తాయి? అనే సందేహం ప్రజల్లో నెల కొంటోంది. పోటీచేసే అభ్యర్థులు అనుమతించిన పరిమితి కంటే పది రెట్లు ఎక్కువ ఖర్చు పెట్టి..ఎన్నికైన తర్వాత దాని కంటే పది రెట్లు ఎక్కువ సంపాదించడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రణాళికా సంఘసభ్యుడొకరు అభిప్రాయపడినట్లు.. ‘‘ఇంతకుముందు డబ్బు ద్వారా అధికారాన్ని సంపాదించడానికి ప్రయత్నించేవారు, ఇప్పుడు అధికారం ద్వారా డబ్బు సంపాదిస్తున్నారు’’.

ఇన్ని దోషాలను, లోపాలను అరికట్టాలంటే ఎన్నికల సంస్కరణలు చేపట్టాలి. అందులో భాగంగా..

- నేరచరితులను ఎన్నికల్లో పోటీ చేయకుండా చట్టపరంగా నివారించాలి.
- ఎన్నికల బరిలో అర్హులైన అభ్యర్థులు లేనప్పుడు, ఓటరుకు నకారాత్మక (Negative) ఓటు వేసే అవకాశముండాలి. అనుకూల ఓట్ల నుంచి వ్యతిరేక ఓట్లు తీసివేయాలి.
- ఓటరుకు ఎన్నికలను బహిష్కరించే హక్కు కల్పించాలి. అప్పుడే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థను

నిర్మించవచ్చు.

- 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు ఎవరికీ లభించనప్పుడు రెండోసారి ఎన్నిక నిర్వహించాలి. ప్రస్తుతం ఈ విధానం ఫ్రాన్స్‌లో అమల్లోఉంది. మనం పాటిస్తున్న ''సాధారణ మెజారిటీ'' పద్ధతి వల్ల, అనేక సందర్భాల్లో గెలిచిన అభ్యర్థికి 16–17 శాతం ఓట్లు మాత్రమే లభిస్తున్నాయి. దీనికి కారణం బహు ముఖ పోటీ. దీంతోపాటు కుల, మత, ప్రాంతీయ తత్వాలను రెచ్చగొట్టడానికి ప్రస్తుత విధానం ఉపయోగపడుతుంది. ఈ అవలక్షణాలన్నిటినీ 50 శాతం ఓట్లు పొందాలన్న నిబంధన నివారిస్తుంది.
- ఎన్నికల ఖర్చును ప్రభుత్వమే భరించాలనే వాదన కూడా తరచుగా వినిపిస్తోంది. వాస్తవానికి ఈ పద్ధతిని అమలు చేస్తున్న ఇటలీ, ఫిన్లాండు, స్పెయిన్, ఆస్ట్రియా వంటి దేశాల్లో ఎన్నికల ఖర్చు ఏ మాత్రం తగ్గలేదు. ప్రజా వ్యవహారాన్ని చక్కదిద్ద లేదు. కార్పొరేట్ సంస్థల ప్రభావాన్ని కొంత మేర నియంత్రించవచ్చు. ఒకవేళ ప్రభుత్వం ఎన్నికల ఖర్చు భరించినా అది వస్తు రూపంలో ఉండాలి తప్ప.. నగదు రూపంలో కాదు. అంటే ఎన్నికల ప్రచారానికి అవసరమైన సామాగ్రిని ఇవ్వడం. అది కూడా కేవలం గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పక్షాలకు మాత్రమే. గత ఎన్నికల్లో అవి పొందిన ఓట్ల శాతం ప్రాతిపదికపై ఇవ్వాలి. పౌర సమాజం చురుగ్గా పాల్గొని, ఓటరు చైతన్యవంతుడిగా మారి, రాజకీయ పక్షాల పనితీరును సదా పర్యవేక్షిస్తూ, చట్టపరంగా చొరవ తీసుకున్నప్పుడే, మన ప్రజాస్వామ్య వ్యవస్థను పీడిస్తున్న చీడను వదిలించుకోవడానికి వీలవుతుంది. అప్పుడే మనం ''భారతదేశం ప్రపంచంలో అతి పెద్ద ప్రజా స్వామ్యమని'' చెప్పుకోవడం అర్థవంతమవుతుంది.